# భగ్న ప్రేమికులు

రచన: శ్రీ కవుల ఆంజనేయశర్మ
శ్రీ జి. ఎస్. కె. సాయిబాబా

(గతసంచిక తరువాయి)

తనకు ఏర్పాటుచేసిన గదిలోకి వెళ్ళాడు రాజా. మణి మేడపైకి వెళ్ళింది.

* * *

పరీక్షలకు బాగా కష్టపడి చదివి పేపర్లన్నీ బాగా రాశారు నాగమణి, ప్రకాశరావు. రత్నమ్మగార్లతో చెప్పి కాకినాడ ప్రయాణం అయ్యాడు రాజా. ఆ సాయంత్రం ఇద్దరూ కలుసుకున్నారు.

'ప్రయాణం ఈరాత్రికేనా రాజా?' అంది అతని చొక్కాగుండీలు సవరిస్తూ మణి.

'రెండుగంటల జనతాకి' అన్నాడు.

'నన్ను మరచిపోకండీ?' అంది నాగమణి.

'మణీ!' అరిచాడు రాజా.

'ఏం?' అంది.

'నన్నే అనుమానిస్తున్నావా? ఇన్నాళ్లూ నీతో కలసి మెలసి తిరిగానే, ఆమాత్రం అర్థం చేసుకోలేవా?' బాధగా అన్నాడు రాజా.

'క్షమించు రాజా!' తల దించుకుంది.

'కోపమొచ్చిందా?'అంటూ వ్రేలితో గడ్డం ఎత్తాడు.

'త్వరలోనే వచ్చేస్తారుగా?' అంది.

'పిచ్చిదానా, నిన్నువిడిచి నేనుమాత్రం వుండగలనా?' కురులు సర్దుతూ అన్నాడు రాజా.

'మీవాళ్ళతో అన్నివిషయాలు మాట్లాడి, వెంటనే వివరంగా ఉత్తరం వ్రాయండి. త్వరగా రావడానికి ప్రయత్నించండి. నాకేం తోచదు.'

'నాకుమాత్రం తోస్తుందా మణీ! అలాగే చేస్తాను.'

నాగమణి కళ్ళంట నీళ్లు జలజల రాలాయి.

'మణీ! ఏమిటిది? కన్నీరు పెడుతున్నావా?' కంగారుగా అడిగాడు రాజా.

'అబ్బే లేదు' అంది.

'మరేమిటిది?' అన్నాడు రుమాలుతో ఆమెకళ్లు ఒత్తుతూ.

'నాకోరిక నెరవేరేసమయం ఆసన్నమయిందనే ఆనందం, నన్ను మీరు విడిచివెళుతున్నారనే బాధ, ఈ రెండూ మిశ్రితమై వచ్చిన కన్నీటి భాష్పాలు!' అంది.

'మణీ! ఏమిటా మాటలు? వెళ్ళాలని నాకూ యిష్టం లేదు. కాని, కన్న తల్లిదండ్రులకు ఒక్కసారైనా కనబడి సంతృప్తి నివ్వాలిగా అందుకని, మన వివాహం గురించి చెప్పి ఒప్పించటానికని' అన్నాడు.

రాజావక్షంపై తలవాల్చి అతని కళ్లల్లోకి చూస్తోంది నాగమణి.

మణి తలను నిమురుతూ, హృదయానికి గట్టిగా ఆమెను అదుముకొని కళ్ళు మూసాడు రాజా.

♦ ♦ ♦

కంపార్టుమెంటులోని లైట్లు కాంతిని వెదజల్లుతున్నాయి. కిటికీల్లోంచి గాలి కంపార్టుమెంటులోకి వీస్తోంది. ట్రెయిను గర్జిస్తూ సామర్లకోట ప్లాట్ ఫారంవద్ద ఆగింది. రాజా లెదర్ కేసులో దిగి సిద్ధంగావున్న జనతా ఎక్కాడు. తలుపులన్నీ మూసి వచ్చి కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించాడు. పొగ వదులుతూ ఆలోచిస్తున్నాడు.

రెండురోజుల్లో వస్తానని నాగమణితో చెప్పివచ్చాడు తను. కాని సుమారు నెలయింది. రెండురోజుల్లో వెళ్లేవాడే తను. కాని ఎస్టేటు వ్యవహారాలు చూసుకొనేసరికి చాలాకాలం పట్టింది. తను ఇల్లు చేరినసాయంత్రమే తన తల్లిదండ్రులకు నాగమణిఫొటో చూపించి ఎలావుందని అడిగాడు.

'ఎవరునాయనా అమ్మాయి?'అడిగారు తల్లిదండ్రులు.

'బాగుందా లేదా, చెప్పండి ముందు' అన్నాడు.

'అమ్మాయికేం రత్నంలా వుంది! ఎవరు?' ప్రశ్నించింది తల్లి.

'విశాఖపట్నంలో లాయరు ప్రకాశరావుగారున్నారు. వారి అమ్మాయి.'

'లాయరు ప్రకాశరావా?' ఆశ్చర్యంతో అడిగారు తండ్రి.

'అవును నాన్నగారూ! చాలా పేరు ప్రఖ్యాతులు గడించారు ఆయన. వారికుమార్తె ఈమె. పేరు 'నాగమణి'; మీకోడలు' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

'రాజా!' అరిచారు గట్టిగా రామచంద్రరావుగారు.

'నాన్నగారూ' భయంతో అన్నాడు రాజా.

కోపంతో రామచంద్రరావుగారి మొఖం కందింది. కళ్ళు ఎర్రబడ్డాయి. పెదాలు అదురుతున్నాయి. శరీరం ఆఘాతమొస్తకం వణుకుతోంది. తన కొడుకుపై కోపం పెరిగిపోతోంది ఆయనికి. ఆపరిణామానికి రాజా కంపించి పోయాడు. అతని మొహంలో చిరునవ్వు అంతరించి, ఆ స్థానే భయం గూడు కట్టుకుంది.

'రాజా! అంతటివాడవయావా? నీ తల్లిదండ్రులు లేరనుకున్నావ్? చచ్చారనుకున్నావా? నీ బంధువులు మట్టిలో కలిశారనుకున్నావా?' గర్జించారు.

'నాన్నగారూ!' భయపడ్తూ అన్నాడు రాజా.

చెంప ఛెళ్ళుమంది. రాజా కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది.

'నీ కెవరూ లేరనుకున్నావా? దిక్కులేనివాడ వయ్యావా? నీబంధువులు, మాతాపితలమధ్య ఎంతో వైభవంగా జరుగవలసిన నీ పెళ్ళి ఈవిధంగా జరుపుకున్నావా?' అన్నారు రామచంద్రరావుగారు.

'నాన్నగారూ'

'నీ పెళ్ళిచూచి ఎంతో ఆనందిద్దామనుకున్నానే! నీ కోరికప్రకారమే చేద్దామనుకున్నామే! ఇలా...దిక్కులేనివాడిలా పెళ్ళి జరుపుకోవలసిన ఖర్మ నీకేం పట్టింది? నిజంగా నాగుండెల్ని చీల్చిపారేశావు రాజా! చీల్చిపారేశావు' అన్నారు.

'నాన్నగారూ!'

'హుఁ! సిగ్గులేకపోతే సరి. నాన్నా అని పిలవటానికి. అనుకున్నదొకటి, జరిగింది వేరొకటి, హే భగవాన్, ఏమిటయ్యా నీ లీలలు?'అన్నారు భగవంతునివైపు చేతులు జోడిస్తూ.

'నాన్నగారూ! మీరు పొరబడ్డారు' అన్నాడు రాజా.

'నేను పొరబడ్డానా? నీవు మతివుండే మాట్లాడుతున్నావా?' అన్నారు కోపంగా.

'అఁ! మతుండే మాట్లాడుతున్నాను. మీ రెందుకిలా వ్యథ పొందుతున్నారో అర్థం కావడంలేదు. మీ పుత్రునిగా నన్ను అర్థం చేసుకోండి. నే నేనాడైనా మీ మాటకు ఎదురుతిరిగేనా? మీ కేదీ తెలియకుండా ఏపనైనా చేశానా? పోనీ అంతెందుకు, మీమనసుకు బాధ కలిగించేలా ప్రవర్తించానా? చెప్పండి'...అన్నాడు.

'లేదు. కానీ ఈనాడు నువ్విలా...' రుద్ధకంఠంతో అన్నారు.

'నాన్నగారూ! ఎప్పుడూ మీ కిష్టంలేనివి, తెలియనివి ఇప్పుడు చేసానంటే ఎలా నమ్ముతున్నారు?'

'నీవు చెప్పేమాటలు, చూపిన ఫోటో.'

'అదా మీకోపానికి కారణం?ఆమె, మీకు కాబోయే కోడలు' అన్నాడు రాజా.

'నిజంగానా?' అన్నారు దంపతులిద్దరూ.

'అవును, నన్ను నమ్మండి! ఈవిషయంలో మిమ్మల్ని అంగీకరింపచేద్దామని చెప్పాను.'

'అయితే పెళ్ళి జరుగలేదా?' అన్నారు ఆశ్చర్యంతో.

'లేదు నాన్నగారూ!'

దాంతో రామచంద్రరావుగారి మనస్సు కుదుట పడింది. 'రాజా! తొందరపడి కొట్టాను. నన్ను మన్నించు' అన్నారు.

'నాన్నగారూ! అంతమాటనకండి! ఎంతైనా మీ పుత్రుణ్ణి. మీ చేతి దెబ్బతిని చాలా రోజులయింది. ఈనాడు మళ్ళీ ఆభాగ్యానికి నోచుకున్నాను' అన్నాడు రాజా.

'చూడు అబ్బాయ్! అమ్మాయి బాగుంది. మధ్యకుటుంబీకురాలైనా ఫరవాలేదు. వెంటనే ముహూర్తం పెట్టిస్తా! ఏమంటావ్?' అన్నారు.

'అలాగే నాన్నగారూ! మరొకవిషయం' అన్నాడు.

'ఏమిటది?' అన్నారు రామచంద్రరావుగారు.

'సంతోషవార్త! నాకోవిషయం చెప్పాలి మీరు.'

'అలాగే' అన్నారు రామచంద్రరావుగారు.

'మీకు చిన్నప్పుడు ప్రకాశరావు అనే స్నేహితులు ఉండేవాడట కదూ?'

'అవును, కొన్ని కారణాలవల్ల ఇద్దరు విడిపోయాం. తిరిగి కలుసుకోనేలేదు. ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో పాపం' అన్నారు.

'ఆయనతోనే మీ రిప్పుడు వియ్యమందబోయేది' అన్నాడు రాజా నవ్వుతూ.

'అఁ! త్రుళ్ళిపడ్డారు' ఆ ప్రకాశరావే? ఎక్కడున్నాడు? ఆత్రుతగా ప్రశ్నించారు.

'అవును, ఆయనే! విశాఖపట్నంలో వున్నారు. వారి అమ్మాయే నాగమణి.'

'ఆహా! ఎంత అదృష్టం? విడిపోయిన నా స్నేహితునితో వియ్యమందటం నిజంగా విధివిలాసం. ఎంత సంతోషకరవార్త చెప్పావ్...చాలాకాలంనుండి వాడి

నొకసారి చూడాలని వుంటూవుండేది. వాడిజాడ ఎక్కడా తెలియలేదు, అది ఈనాడు నీవల్ల నెరవేరడం నిజంగా గర్వించతగ్గవిషయం. ఎంతటివాడవయ్యావు రాజా! అతను నా స్నేహితుడని నీకెలా తెలిసింది? విడిపోయేటప్పటికి నువ్వు చిన్నవాడివిగదా!' అన్నారు రామచంద్రరావుగారు.

'మీపేరు చెప్పగానే తక్కినవిషయాలన్నీ ఆయనే చెప్పేశారు' అన్నాడు రాజా.

'అవును, వాడు నన్ను మరువడని తెలుసు!' అన్నారు సంతోషంగా.

'లాయరుగా వృద్ధిలోకి వచ్చాడన్నమాట! పోనీలే, అదే కావలసింది. నువ్వు భోజనానికి వెళ్లు రాజా! ఎస్టేటు వ్యవహారాలు చూచుకొని వెంటనే వెళ్లు విశాఖపట్నం. ముహూర్తం పెట్టిస్తా' అన్నారు.

'అలాగే!' అంటూ మేడపైకివెళ్ళాడు డ్రెస్ మార్చుకునేందుకు రాజా.

* * *

నాగమణి ఏం చేస్తుందో? తనపై కోపంగా మాటలాడుతుంది కాబోలు. నిష్ఠూరం వేస్తుంది. ఏంచెయ్యాలి? భరించక తప్పదు. పాపం, ఎంత ఆశపడిందో రెండు రోజుల్లో వస్తానంటే, ఆ వ్యవహారాలన్నీ ముగించేసరికింతకాలం పట్టింది. లెటర్ రాశాను, స్టేషనుకి వస్తుందో? ఎన్నిసార్లు పిలిచినా కోపంతో మాట్లాడదు కాబోలు, ఇందుకు క్షమాపణలు తెల్పాలి, బ్రతిమాలాలి! ఎన్నో విధాల ఇలా వూహించుకుంటున్నాడు రాజా. సిగరెట్ పూర్తిగా కాలి చుర్రుమనేసరికి ఇహలోకంలో పడ్డాడు, కిటికీలోనుండి సిగరెట్ బైటకు విసిరేస్తూ చూశాడు, జనతా శరవేగంతో దూసుకుపోతోంది. వాచీ చూశాడు, సరిగ్గా తెల్లవారుఝాము నాలుగుగంటలైంది.

జనతా గర్జిస్తూ చిన్నచిన్న స్టేషన్లుదాటుతూ, పెద్ద స్టేషన్లలో ఆగుతూ సాగుతోంది. పట్టాలపై టకటక చప్పుడుచేస్తూ వేగాన్ని అధికం చేస్తోంది. వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది, తారలు మిణుకుమిణుకుమంటూ శశాంకుడితో ఆటలాడుకుంటున్నాయి. మేఘమాలికలు ఎవరినీ చూడకుండా పరుగునపోయి చంద్రుణ్ణి కప్పుతున్నాయి.

చెట్లపై వెన్నెలపడుతూ మెరుస్తోంది. కొండలు, కోనలు, పొలాలు, ఎలక్ట్రిక్ స్తంభాలు, చెట్లు, పుట్టలూ, గట్టులూ వెనక్కినెట్టుతూ జోరుగా సాగుతోంది జనతా.

చల్లనిగాలి వీస్తోంది. రాజా కిటికీలోనుండి చూడటం ఆపి, లెదర్ కేసునుండి నవలొకటి బైటకుతీసి చదువసాగాడు, ఒక పావుగంటకు నిద్రాదేవి అతన్ని ఆవరించింది. బెర్తుపై ప్రక్కకు వాలిపోయాడు.

ట్రెయిను తనపని తాను చేసుకుపోతోంది.

తెల్లవారి ఆరుగంటలయింది. తూర్పు సూర్యభగవానుడుదయించాడు. కిరణాలు నలుదిశలా ప్రాకుతున్నాయి. పక్షులు కిలకిలా రావము చేస్తూ ఆహారానికి బయలుదేరుతున్నాయి. పశువుల్ని తోలుకొని రైతులు పొలాల్లోకి వెళ్తున్నారు.

రాజాకి మెలుకువ వచ్చింది. ఆరోజు జనతా లేటవడంతో ఆస్టేషనులో జనం ఎక్కువమంది ట్రెయిన్ ఎక్కసాగారు. వర్షం పడటంమూలాన ప్లాట్ ఫారంపై అక్కడక్కడ నీరు నిలిచివుంది. ఇంకా వర్ష పుచుక్కలు పడుతూనేవున్నాయి టపటపమంటూ, కంపార్టుమెంటు దిగి కాఫీ త్రాగివచ్చాడు రాజా. తిరిగి ట్రెయిన్ కదిలింది.

రాత్రి వర్షంవల్ల భూమంతా తడిగా వుంది. చెట్లపై నీటిబిందువులు భానుని కిరణాలకు మిలమిలా మెరుస్తున్నాయి. గాలికి కొమ్మలు వూగుతూంటే రెమ్మలపైవున్న నీటిబిందువులు వర్షిస్తున్నట్లుగా క్రిందికి పడుతున్నాయి.

ట్రెయిన్ అరగంటకు వాల్తేరు ప్లాట్ ఫారంవద్ద ఆగింది. ఇంజను నీటికి వెళ్ళింది. రాజా లెదర్ కేస్ తీసుకొని, ప్లాటుఫారంపై కాలు పెట్టగానే ఎవరో తుమ్మున తుమ్మారు, ఎడంకన్ను బెదిరింది, కాలు తడబడింది, మనస్సు ఏదో కీడును శంకిస్తోంది. ఏమిటా అని ఆలోచిస్తూ నాగమణికోసం చుట్టూ కలయజూశాడు రాజా. ఎక్కడా కనిపించలేదు. బైటకువచ్చి రిక్షాలో కూర్చున్నాడు. 'గాంధీ స్ట్రీట్' అన్నాడు. రిక్షా కదిలి వేగాన్నందుకుంది. సిగరెట్ వెలిగించి ఏమిటా శరీరం అదురుతోందని ఆలోచించసాగాడు.

కొంతసేపటికి నాగమణి యింటిముందు ఆగిందా రిక్షా. రిక్షా దిగి గేటు తెరిచాడు. 'మ్యావ్!' అంటూ ఒక పిల్లి ఎదురైంది. లోనికడుగెట్టి ఆగిపోయాడు, తలుపులు వేసున్నాయి. ప్రక్కకు తిరిగాడు, తామిద్దరూ కలుసు

కుంటూవుందే ప్రదేశంలోనిచెట్లు కూకటివ్రేళ్ళతో సహా నేల కూలివుంది, ఆ ప్రదేశమంతా నిర్జీవంగా తయారైంది. రాజా కిదేం అర్థం కాలేదు. 'వూరికెళ్ళారేమో? వెళితే తనకి ఉత్తరం రాసేదిగా! ఏమిటిది? మనస్సు అదురుతోంది' అనుకున్నాడు.

అప్పటికే శవాన్ని స్మశానానికి తీసుకుపోయారు. ప్రకాశరావుగారింటిముందు రిక్షా ఆగటంచూచి చుట్టుప్రక్కలవారు వచ్చారు. 'ఏం బాబు ఎవరు కావాలి?' అడిగిందొక ముత్తైదువు.

'ప్రకాశరావుగారండీ! వూళ్ళోలేరా?' అన్నాడు.

'ఇంకెక్కడి ప్రకాశరావు బాబూ' అంది ఆమె.

'ఆఁ! ఏమిటమ్మా మీరనేది?' కంగారుగా అడిగాడు రాజా.

'ఏం చెప్పను నాయనా, నోరు రావటంలేదు' కళ్లు వత్తుకుంటూ అందా ముత్తైదువు.

'ఏంమ్మా? ఏం జరిగింది? నామనస్సు కంగారు పడుతోంది, గుండెలు అదురుతున్నాయి, శరీరం కంపిస్తోంది, చెప్పండమ్మా!' అన్నాడు దీనంగా రాజా.

'మనోవ్యాధితో నాగమణి మంచ మెక్కింది. అది ముదిరిపోయింది. ఆజబ్బుతో మనిషి బాధపడి పూర్తిగా నీరెక్కిపోయింది. డాక్టర్లు లాభం లేదని చెప్పారు. తెల్లవారుఝాము నేఈలోకాన్ని విడిచివెళ్ళింది' అందామె.

'ఆఁ! మరణించిందా?' అరిచాడు దుఃఖంతో.

'అవును బాబూ! శవాన్ని స్మశానికి తీసుకు వెళ్ళారిప్పుడే' అంది దుఃఖంతో ఆమె.

'అయ్యో! ఎంత ఘోరం జరిగింది? ఒక్క నెలలో ఇంత మార్పా? భరించలేని బాధ! నా ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఎన్ని వూహించానో, ఎన్ని కోరికలు పెంచుకున్నానో, ఎన్ని చేయాలనుకున్నానో, ఎన్ని గాలిమేడలు కట్టానో_అవన్నీ క్షణంలో నశించిపోయాయి. అయ్యో మణీ! ఏమిటీ ఘోరం? నీ రాజా ఏమయ్యాడనుకున్నావ్? నన్ను విడిచి వెళ్ళిపోయావా? ఎన్ని కోరికలతో వచ్చానో అన్నీ నేలరాలాయి, నాజీవితం అంధకారబంధురమైంది. నా జీవనజ్యోతి ఆరిపోయింది. నేను జీవించలేను. నేను నీ వెనకాలే వస్తున్నాను. నేను వేగంగా రాలేదని యింతశిక్ష విధించావా? ఈబాధ భరించలేను మణీ' అంటూ తల బాదుకొని దుఃఖిస్తున్నాడు. అతని ప్రేమ భగ్నమయింది. కోరికల సౌధంనుంచి విధి అతన్ని వేరుచేసింది. తపనచే అతనిహృదయం మండిపోతోంది, గుండెలు బద్దలవుతున్నాయి. మనిషి నీరసించిపోతున్నాడు. దుఃఖం భరించలేకపోతున్నాడు.

చటాలున వెనుదిరిగాడు. వెంటనే రిక్షాలోకి వురికి 'పోనీయ్ స్మశానానికి' అరిచాడు.

రిక్షా కదిలింది. రిక్షాలో కాళ్ళపై తలపెట్టుకొని కుమిలిపోతూ కన్నీరు కారుస్తున్నాడు. 'పోనీయ్, ఇంకా వేగంగా పోనీయ్' పిచ్చిగా అరిచాడు.

'క్షమించండి సార్! ఇప్పటికే ఎంతో వేగంతో తొక్కుతున్నాను, ఇంకా ఎక్కువైతే ఆక్సిడెంటు తప్పదు' అన్నాడు.

'నా జీవిత భాగస్వామే పోయినప్పుడు నేను బ్రతికుండిమాత్రం ఎందుకు?' అంటూ ఏడ్వసాగాడు.

కొంతసేపటికి స్మశానం చేరింది రిక్షా. క్రిందకురికి పరుగున ప్రవేశించాడు రుద్రభూమిలోకి.

అప్పటికే దహనసంస్కారాలు పూర్తిచేసుకొని వెనుదిరిగిన డాక్టరు రాజారావు, ప్రకాశరావుగార్లు కనిపించారు రాజాకు.

'ప్రకాశరావుగారూ! ఏదీ నామణెక్కడ? ఆమె శవాన్నయినా చూడనివ్వండి' రోదిస్తూ అన్నాడు.

'ఇంకెక్కడి మణి. అంతా అయిపోయింది రాజా!' అంటూ ముఖానికి చేతులు అడ్డంపెట్టుకొని దుఃఖించారు ప్రకాశరావుగారు.

'ఎంత శిక్ష విధించావ్? ఆఖరికి నేను చేసిన చిన్న నేరానికి నీముఖమైనా చూపటాని కిష్టపడలేదా? మణీ!' అంటూ భయంకరంగా అరచాడు రాజా.

'అయిపోయినదానికి ఎంత విచారిస్తేమాత్రం యేం లాభం బాబూ!' అన్నారు డాక్టరు రాజారావుగారు.

ముగ్గురూ యింటికి చేరారు. కళకళలాడుతున్న ఆ గృహం కళావిహీనమైంది. ప్రకాశరావు, రత్నమ్మగార్ల దుఃఖానికి అంతేలేదు పాపం! డాక్టరు రాజారావుగారు వారిని ఎంతగానో ఓదార్చి, రెండురోజులుండి వెళ్ళిపోయారు.

రాజామాటప్రకారం కొన్నిరోజులు కాకినాడలో అతని యింటివద్ద ఉంటానికి నిశ్చయించుకొని ప్రకాశరావు, రత్నమ్మగార్లు అతనితో ప్రయాణమయ్యారు.


కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
[స్థాపితము 1933]
విడి ప్రతి ... 25 పై.
సంవత్సర చందా ... రూ 5-00
(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్‌బాథమ్స్, స్వదేశమిత్రన్
బుక్‌స్టాల్స్‌లోనూ దొరకును.